

బీఆర్ఎస్‌లో చేరుతున్న మారంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు గజం రాజు, కచ్చకాయల రాజేశ్వర్



జీవన్‌రెడ్డికి స్వాగత పలుకుతున్న గ్రామస్తులు



జీవన్‌రెడ్డి దంపతులను గజమాలతో సన్మానిస్తున్న మారంపల్లి

# పదేండ్లలో మారిన ఆర్మూర్ రూపురేఖలు

- బీఆర్ఎస్ హయాంలో కళకళలాడుతున్న పల్లెలు
- గ్రామగ్రామాన సీసీ రోడ్లు, డ్రైనేజీలు
- ఆర్మూర్‌లో 100 పడకల దవాఖాన
- 'నమస్తే నవనాథపురం'లో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్, అక్టోబర్ 20 : పదేండ్లలో కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఆర్మూర్ నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. నమస్తే నవనాథపురంలో భాగంగా శుక్రవారం డొంకేశ్వర్ మండలంలోని మారంపల్లి గ్రామంలో ప్రజాఆశీర్వాద యాత్రలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో జీవన్‌రెడ్డికి ప్రజలు డప్పువాయిధ్యాలు, మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. వందలాది మంది యువకులు బైక్ ర్యాలీ నిర్వహించి తమ అభిమాన నేతను ఆప్యాయంగా స్వాగతించారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాతుడూ ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోందని, ఆర్మూర్‌లోని సిద్ధుల గుట్ట గొప్ప దివ్య క్షేత్రంగా పర్యాటక స్థలంగా మారిందని అన్నారు. తాను మారంపల్లి గ్రామ అల్లుడిని, తనకు అండగా నిలవాలని కోరారు. బీఆర్ఎస్ అంటే తెలంగాణకు భరోసా అని, కాంగ్రెస్, బీజేపీలొస్తే మళ్లీ అదే అరిగోస పడక తప్పదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఏనాడైనా మీ ఊరికొచ్చారా, మీ బాగోగులు చూశారా అని ప్రశ్నించారు. కారు డ్రైవర్ చెప్పకుండా ఏ ఊరికి ఎలా వెళ్లాలో కూడా తెలియని ఈ కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఎవరైనా ఓటేస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

**మన ఊరి అల్లుడిని గెలిపించుకుందాం**

మారంపల్లి ఎన్నికల ప్రచార సభలో బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి మాట్లాడుతూ మన ఊరి అల్లుడు జీవన్‌రెడ్డిని గెలిపించుకుని మారంపల్లి గ్రామాభివృద్ధికి బాట వేసుకుందామని పిలుపునిచ్చారు. ఊరు ఊరంతా తన భర్త జీవన్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తూ ఒకటిగా నిలవడం తనకు సంతోషం కలిగిస్తున్నదన్నారు. 'మీ ఓటు కారు గుర్తుకు వేయండి, జై తెలంగాణ' అంటూ రజితారెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో పలువురి చేరిక**

డొంకేశ్వర్ మండలంలోని మారంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు గజం రాజు, కచ్చకాయల రాజేశ్వర్ బీఆర్ఎస్‌లో చేరగా పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి జీవన్‌రెడ్డి ఆహ్వానించారు.

నందిపేట్ మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు బోగ రాము బీఆర్ఎస్ పార్టీలో చేరగా ఆయనకు గులాబీ కండువా కప్పి జీవన్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బోగ రామును బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా ఎమ్మెల్యే ప్రకటించారు.

## బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో రాష్ట్రంలో పండుగ వాతావరణం



అడవిమామిడిపల్లిలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

మాక్లూర్, అక్టోబర్ 20: బీఆర్ఎస్ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోతో రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. నమస్తే నవనాథపురంలో భాగంగా మండలంలోని అడవిమామిడిపల్లి గ్రామంలో ప్రజాఆశీర్వాద యాత్రలో జీవన్‌రెడ్డి మాట్లాడారు. ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం తనను మళ్లీ ఆశీర్వదించారని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## బీజేపీతో పోరాడితే 24కేసులు పెట్టారు

### ఆర్మూర్ విజయభేరి సభలో రాహుల్‌గాంధీ



ఆర్మూర్ సభలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

ఆర్మూర్, అక్టోబర్20: బీజేపీతో పోరాడితే తనపై 24 కేసులు పెట్టారని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ అన్నారు. విజయభేరి బస్సు యాత్ర శుక్రవారం ఆర్మూర్‌కు చేరింది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ నుంచి భారీ ద్విచక్ర వాహన ర్యాలీతో ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాకు రాహుల్‌గాంధీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీకి మద్దతుగా కాంగ్రెస్‌ను ఓడించేందుకు అన్ని రాష్ట్రాల్లో ఎంఐఎం పార్టీ పోటీ చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎంఐఎం ఎక్కడెక్కడ పోటీ చేయాలో బీజేపీ లిస్టు తయారు చేసి ఇస్తోందన్నారు. కాంగ్రెస్‌లో చేరేందుకు బీజేపీ నాయకులు క్యూ కడుతున్నారన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీసగడ్‌లో బీజేపీని ఓడించి తీరుతామన్నారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం చోరీ

ఆర్మూర్, అక్టోబర్20: పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం మహాసభ రాష్ట్ర కార్యదర్శి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోలసుధాకర్‌కు చెందిన ద్విచక్ర వాహనం గురువారం చోరీకి గురైంది. మహాలక్ష్మీ కాలనీలోని కన్యకా పరమేశ్వరి ఆలయం ఎదుట బైక్ నిలిపి ఉంచి తిరిగి వచ్చి చూసే సరికి లేదని పేర్కొన్నారు. ఈ విషయమై పోలసుధాకర్ ఆర్మూర్ పోలీసులకు సమాచారం అందించారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోటపాటి

## బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

వేల్పూర్, అక్టోబర్ 20: సీఎం కేసీఆర్ జనరంజక పాలన, సంక్షేమ పథకాలు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు ముస్కు శేఖర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు సంతోష్‌రెడ్డి వారి అనుచరులు సుమారు 30 మంది బీఆర్ఎస్ నాయకుడు రాజాగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకుడు కోటపాటి నర్సింహనాయుడు వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## తగ్గుతున్న శ్రీరాంసాగర్ నీటిమట్టం

మెండోరా, అక్టోబర్ 20: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాలువలకు నీటి విడుదల కొనసాగుతుండడంతో ప్రాజెక్టులో క్రమక్రమంగా నీటి మట్టం తగ్గుతున్నదని ఏఈఈ మాణిక్యం శుక్రవారం తెలిపారు. కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 300, లక్ష్మీ 200, మిషన్ భగీరథ తాగునీటి అవసరాల కోసం 152 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామన్నారు.

## ఆలూర్ వీడీసీ ఎన్నిక

ఆర్మూర్, అక్టోబర్20: ఆలూర్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నలిమెల మోహన్‌రెడ్డి, కార్యదర్శిగా తిర్మన్‌పల్లి రాకేశ్, ఉపాధ్యక్షులుగా భోజన్న, ఎం.గంగాధర్, కోశాధికారులుగా దుగ్గి మధు, గుండా మల్లేశ్, సంయుక్త కార్యదర్శిగా రేగుల్ల రజినీకాంత్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను గ్రామస్తులు సన్మానించారు.

## అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తనిఖీ బృందాలు



మాట్లాడుతున్న ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్

బోధన్, అక్టోబర్ 20: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలీస్, మున్సిపల్, రెవెన్యూశాఖల సమన్వయంతో తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని బోధన్ పట్టణ ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నిలు పూర్తయ్యే వరకు 24/7 అధికారుల బృందాలు తనిఖీలు చేపడుతూనే ఉంటాయని ఆయన అన్నారు. ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు. బోధన్ నియోజకవర్గంలోని బోధన్ పట్టణం, రూరల్, ఎడపల్లి, రెంజల్, నవీపేట్ మండలాల్లో తనిఖీలు నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రతి బృందంలో ఓ అధికారితోపాటు పోలీస్ కానిస్టేబుల్, కెమెరా, వీడియో గ్రాఫర్ ఉంటాడని వివరించారు. మూడు షిఫ్టులుగా వారు విధులు నిర్వహిస్తారని, ప్రజలు తనిఖీలు చేసే అధికారులకు సహకరించాలని ఏసీపీ సూచించారు. పలువురు మండల పరిషత్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులను కూడా తనిఖీ బృందాల అధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ బృందాలు పనిచేస్తాయని అన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



చిన్నాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

మాక్లూర్, అక్టోబర్ 20: మండలంలోని చిక్లీ, మాక్లూర్, బొంకన్‌పల్లి, చిన్నాపూర్, మామిడిపల్లి గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఏసీపీ కిరణ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై సుధీర్‌రావు తదితరులు ఉన్నారు.

## అంతర్ రాష్ట్ర సరిహద్దులో ముమ్మరంగా తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఎస్సై ఉదయ్‌కుమార్

రెంజల్, అక్టోబర్20: మండలంలోని కందకుర్తి సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర సరిహద్దులో శుక్రవారం వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేసినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తెలంగాణ –మహారాష్ట్ర సరిహద్దు మార్గం గుండా అక్రమంగా మద్యం, డబ్బు తరలించకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిరంతర తనిఖీలు కొనసాగుతాయని అన్నారు.

## జీపీ సిబ్బందికి దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఖలీంబేగ్

రెంజల్, అక్టోబర్ 20: మండలంలోని కందకుర్తి గ్రామ పంచాయతీ సిబ్బందికి శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో దుస్తులను పంపిణీ చేశామని సర్పంచ్ ఖలీంబేగ్ తెలిపారు. ఏటా మాదిరిగానే ఈసంవత్సరం కూడా దసరా పండుగ కానుకగా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యోగేశ్, నీలా విండో చైర్మన్ ఇమ్రాన్‌బేగ్, బీఆర్ఎస్ నాయకుడు గౌసొద్దీన్, కార్యదర్శి నవీన్, కారోబార్ సాజీద్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

ఎడపల్లి, అక్టోబర్ 20: మంగళ్‌పాడు గ్రామంలో శుక్రవారం ఓ వ్యక్తి ఉరేసుకొని మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌పాడుకు చెందిన లింగయ్య(52) భార్య మూడు నెలల నుంచి అరోగ్యంతో బాధపడుతున్న. దీంతోపాటు ఆర్థిక పరిస్థితులు భాగలేక మనస్థాపానికి గురై గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపడుతున్నారు.